నమస్తే తెలంగాణ
హనుమకొండ
10 | వరంగల్, ఆదివారం 16 మార్చి 2025 | HANUMAKONDA

దేవాదుల ఆయకట్టుకు రూ. 600 కోట్ల నష్టం

- వెంటనే నీళ్లు విడుదలచేసి పంటలు కాపాడాలి
- రిజర్వాయర్లన్నీ వెంటనే నింపాలి
- జనగామ నియోజకవర్గ రైతులను ఆదుకోవాలి
- పంటలు ఎండిన రైతులకు పరిహారం ఇవ్వాలి
- రైతులకు 100 శాతం రుణమాఫీ అయ్యిందని నిరూపిస్తే పదవికి రాజీనామా
- అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : సకాలంలో రిజర్వాయర్లు నింపకపోవడం వల్ల దేవాదుల ఆయకట్టు కింద రూ. 600 కోట్ల పంట నష్టం జరిగిందని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జనగామ నియోజకవర్గంలోని రిజర్వాయర్లను నింపి, ఎండిన పంటలకు ఎకరానికి రూ. 20 వేల పరిహారం అందించాలని కోరారు. శనివారం అసెంబ్లీలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై పల్లా గళమెత్తారు. జనగామ నియోజకవర్గంలోని గ్రామాలన్నీ దేవాదుల ఆయకట్టులో ఉంటాయన్నారు. ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యంతో గత 60 రోజుల్లో 40 రోజులు మాత్రమే దేవాదుల పంపులు నడిపారన్నారు. దాదాపు 5.14 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాల్సి ఉంటే 3 లక్షల ఎకరాలకు ఇస్తామని చెప్పి 34 రోజుల్లో రూ. 6 కోట్లు ఇవ్వకపోవడంతో భారీ నష్టం జరిగిందన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో డెడ్‌స్టోరేజీకి చేరుకుందని, ఉన్న కొద్ది నీళ్లు మాకే రావాలని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, గండిరామారానికి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే వచ్చి మేం తీసుకుపోతం అంటరని అన్నారు. బిల్లులు చెల్లించలేదని సిబ్బంది సమ్మె చేస్తే అధికారులు, ప్రభుత్వం పట్టించుకోలేదని, దీంతో మోటర్లు ఆలస్యంగా ఆన్ చేయడంతో పంటలు ఎండి రైతులకు రూ. 600 కోట్ల నష్టం జరిగిందన్నారు. 'నేను చెప్పేది అబద్ధం అయితే మీ అందరి సాక్షిగా నా ముక్కు నేలకు రాస్తా' అని సవాల్ చేశారు. కేసీఆర్ హయాంలో 72 లక్షల మంది రైతులకు రూ. 80 వేల కోట్లు 12 విడతలుగా ఇస్తే ఈ ప్రభుత్వం గత వానకాలం, ఈ యాసంగికి ఇవ్వలేదన్నారు. గతంలో నీటి తీరువాను రద్దు చేసి అన్ని జలాశయాలు నింపామని, ఇప్పుడు జనగామలో జిల్లాలోని తపాస్‌పల్లి, గండిరామారం, బొమ్మకూర్, కన్నెబోయిన గూడెం, లద్నూర్ సహా అన్ని రిజర్వాయర్లు ఎండిపోయాయన్నారు. దేవాదులలో నీళ్లు వస్తున్నాయని, మొదటి, రెండో దశలు పూర్తయ్యాయని, థర్డ్ ఫేస్ నిర్మాణం కూడా జరిగిందని, దీనిని వెంటనే ప్రారంభించి రిజర్వాయర్లు నింపాలని పల్లా విజ్ఞప్తి చేశారు. లోవోల్టేజీతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలుతున్నాయని, అటు నీళ్లు, ఇటు కరెంటు సమస్యతో ఇప్పటికే 50 శాతం పంటలు ఎండిపోయాయన్నారు. 'నమ్ముకొని అధికారం ఇస్తే నమ్మకం పోగొట్టుకుంటివి..పదవి, అధికారం బూని పదిలంగా తలబోడిజేస్తివి.. టోపీ పెడితివి లాభపడితివి' అన్న ప్రజాకవి కాళోజీ మాటలు ప్రస్తుతం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి సరిగ్గా సరిపోతాయన్నారు. తెలంగాణ చిహ్నం నుంచి కళాతోరణం, చార్మినార్ తీయాలని చూస్తున్నారని, వరంగల్ వాళ్లం ఆత్మగౌరవం ఉన్నోళ్లమని, వరంగల్ మహనీయులైన రాణీ రుద్రమదేవి, సర్దార్ సర్వాయి పాపన్న, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, సమ్మక్క సారలమ్మ సాక్షిగా ఆత్మగౌరవం కోసం పోరాడుతామని పల్లా అన్నారు. రాజముద్రలో నుంచి కాకతీయుల కళాతోరణం, చార్మినార్ మార్చొద్దని, మారిస్తే మేం అధికారంలోకి వచ్చిన వెంటనే తెచ్చుకుంటామని స్పష్టం చేశారు. 'రైతు రుణమాఫీపై ప్రభుత్వం అబద్ధాలు చెబుతున్నది. జనగామ నియోజకవర్గంలోని 127 గ్రామాల్లో ఎక్కడికైనా పోదాం.. ఎక్కడైనా 100 శాతం మాఫీ జరిగినట్టు నిరూపిస్తే ముక్కు నేలకు రాసి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా' అని పల్లా రాజేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు.

నిలదీస్తేనే నీళ్లు వదిలారు

జనగామ నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న నీటి గోసపై అసెంబ్లీలో నిలదీయడంతో తేరుకున్న ప్రభుత్వం శనివారం సాయంత్రం తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు దేవాదుల నీటిని విడుదల చేసిందని పల్లా అన్నారు. దేవాదుల ఓఅండ్‌ఎం కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేక 34 రోజులు మోటర్లు ఆన్ చేయని అసమర్థ కాంగ్రెస్ వల్లే జనగామకు మునుపటి కరువు వచ్చిందని ధ్వజమెత్తారు. ఆగకుండా మోటర్లు నడిస్తే రిజర్వాయర్లన్నీ నిండి పొలాలకు నీళ్లు వచ్చేవన్నారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా పడినా వినియోగించుకోలేక వేల టీఎంసీలు గోదావరిలో కలిశాయని ఆందోళన వ్యక్తం చేశారు. లక్షల ఎకరాల్లో పంట ఎండిపోతుంటే కాంగ్రెస్ నాయకులకు చీమ కుట్టినట్టయినా లేదన్నారు. వెంటనే దేవాదుల ఫేజ్-3 మోటర్లను ప్రారంభించి పొలాలకు నీళ్లందించాలని, ఎండిన పంటలకు సాయం ప్రకటించాలని పల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం వేములపల్లి వద్ద పాలేరు వాగులో జేసీబీతో బావి తోడిస్తున్న రైతు

చుక్క నీరు లేక.. రైతన్నకు దిక్కుతోచక

ఎండిపోతున్న పంటలు పశువుల మేతకు..

చెరువులు, కుంటలు, బోర్లు, బావుల్లో చుక్క నీరు లేక.. రైతన్న దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఎండిన పంటలను పశువులకు మేతగా వేస్తున్నాడు. కళ్ల ముందే చేతి కందే పంటలు ఎండిపోతుంటే రూ. లక్షల అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టామని అన్నదాత కన్నీళ్లు పెట్టుకుంటున్నాడు. అక్కడక్కడా ఉన్న కొద్దిపాటి నీటితో తండ్లాడుతున్నాడు. జేసీబీలతో వాగుల్లో బావులు తీస్తూ వచ్చిన అరకొర నీటితో పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఎస్సారెస్పీ కాల్వలకు నీళ్లు విడుదల చేయకపోవడంతో గడ్డి, చెట్లు పెరిగి ఆనవాళ్లు కోల్పోతున్నాయి. చి'వరి' ప్రయత్నంగా నీటి పారుదల శాఖ అధికారులు పర్యవేక్షించి కాల్వలకు జలాలు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. - నమస్తే నెట్‌వర్క్, మార్చి 15

- కళ్ల ముందే చేతికందే పంట ఎండిపోతుంటే కన్నీరు పెట్టుకుంటున్న అన్నదాతలు
- అక్కడక్కడా ఉన్న కొద్దిపాటి నీటితో తండ్లాట
- చి'వరి' ప్రయత్నంగా కాల్వలకు జలాలు విడుదల చేయాలని వేడుకోలు

మక్కజొన్న పంటను చూస్తూ దిగాలుగా ఉన్న రైతు సింగరవేన సారయ్య

పశువుల మేతకు పంట - దిగాలుగా అన్నదాత

భీమదేవరపల్లి, మార్చి 15: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతన్నకు కన్నీరే మిగులుతున్నది. వ్యవసాయ బావిలో నీరు అడుగంటిపోవడంతో పుట్టెడు అప్పులు తెచ్చి వేసిన మక్కజొన్న పంట పశువులకు మేతగా మారింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామ పంచాయతీ పరిధిలోని హవల్దార్‌పల్లిలో కత్తుల కుమారస్వామి తనకున్న రెండెకరాల్లో మక్కజొన్న పంట వేశాడు. పదికోలల వరకు లోతు ఉన్న వ్యవసాయ బావిలో చుక్క నీరు లేదు. పంటకు సాగునీరు లేకపోవడంతో తన ఆవు, లేగ దూడకు మక్కజొన్న పంట పశుగ్రాసంగా మారింది. ఇతని పక్కనే సింగరవేన సారయ్య వ్యవసాయ భూమి ఉంది. ఇతని బావిలో కూడా నీరు లేదు. తెచ్చిన పెట్టుబడికి ఎట్ల అప్పు చెల్లించాలో అర్థంకాక తన మక్కజొన్న పంటలోనే దిగాలుగా కూర్చున్నాడు. గత పదేళ్లుగా పంటలు బాగా పండినై..నీటికి కొదువ లేక ఎవుసం బాగా నడిచింది. ఇప్పుడేమో కరువు మల్ల కాటేస్తాంది.. అంటూ ఆవేదన చెందాడు.

పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు

పాలేరు వాగులో బావి తవ్వుతున్న రైతులు

దంతాలపల్లి, మార్చి 15 : మండల పరిధిలోని పాలేరు వాగు కింద గత బీఆర్ఎస్ హయాంలో మాదిరిగానే సాగు నీరు సమృద్ధిగా ఉంటుందనుకొని రైతులు యాసంగి వరి, మక్కజొన్న, మిరప పంటలను సాగు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు పూర్తిస్థాయిలో సాగు నీరందడం లేదు. ఎస్సారెస్పీ ద్వారా నీటిని వదలకపోవడంతో మండలంలోని వేములపల్లి సమీపంలోని పాలేరు వాగు ఎండిపోవడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. జేసీబీల సహాయంతో వాగులో బావి తవ్వి వచ్చిన కొద్దిపాటి ఊటతో చేనుకు పారించుకుంటున్నారు.

తొర్రూరులో ఎండిన మక్కజొన్న పంటలో పశువులను మేపుతున్న వెంకటమ్మ

శ్రీరాములపల్లి శివారులో గడ్డి పెరిగి ఆనవాళ్లు కోల్పోయిన ఎస్సారెస్పీ కాలువ

చివరి ఆయకట్టుకు నీళ్లేవి?

చెట్లతో ఆనవాళ్లు కోల్పోయిన ఎస్సారెస్పీ కాల్వ

కమలాపూర్, మార్చి 15: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని చివరి ఆయకట్టుకు ఎస్సారెస్పీ కాల్వ నీళ్లు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. హసన్‌పర్తి మండలం నుంచి కమలాపూర్ మండలంలోని అంబాల, శ్రీరాములపల్లి, గూనిపర్తి, మాధన్నపేట, శనిగరం, గోపాల్‌పూర్ గ్రామాలకు సాగునీరందించేందుకు ఎస్సారెస్పీ కాల్వ నిర్మించారు. అందులో నీళ్లు రాకపోవడంతో మక్కజొన్న, వరి పంటలు ఎండుతుర్నాయి. కాల్వ నీళ్లు వదలకపోవడంతో అందులో గడ్డి, చెట్లు పెరిగి ఆనవాళ్లు కోల్పోతున్నాయి. నీటి పారుదల శాఖ అధికారులు పర్యవేక్షించి నీటిని చివరికి అందేలా చూడాలని కోరుతున్నారు.

ఎండిన కాల్వలు.. రైతుల ఇబ్బందులు

తొర్రూరు: తొర్రూరు మండలంలో కాకతీయ మెయిన్ కెనాల్ ద్వారా సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మైలారం రిజర్వాయర్ ఫేస్-2 నుంచి కాకతీయ మెయిన్ కెనాల్ డీబీఎం 59, డీబీఎం 57, డీబీఎం 60 కాల్వలు, సబ్ మైనర్ కాల్వల ద్వారా నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. మండలంలో గతేడాదితో పోలిస్తే నీటిమట్టం గణనీయంగా తగ్గింది. 2024 మార్చిలో 13.71 మీటర్ల నీటిమట్టం ఉండగా, 2025 మార్చిలో 7.85 మీటర్లకు పడిపోయింది. మొత్తంగా 5.86 మీటర్ల మేర తగ్గింది. మండలంలో మొత్తం 16,500 ఎకరాల్లో వరి, 2,400 ఎకరాల్లో మక్కజొన్న సాగు చేయగా, ప్రస్తుతం 50 శాతం కంటే ఎక్కువ పంటలు నీరులేక ఎండిపోతున్నాయి. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టామని, వెంటనే సాగు నీరందించాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

పంట ఎండిపోయింది

మూడెకరాల్లో మక్కజొన్న, మరో మూడెకరాల్లో వరి పంట సాగు చేసిన. పెట్టుబడి కోసం రూ.లక్ష అప్పు తెచ్చిన. పక్కనే కాల్వ ఉన్నా నీరు లేక పంటలు ఎండిపోయినయ్. పంటలను పశువులకు మేపాల్సిన పరిస్థితి వచ్చింది. - నాగెల్లి వెంకటమ్మ, రైతు, తొర్రూరు

కాల్వ ఒడ్డున ఉన్నా కరువు తప్పలేదు

ఐనవోలు, మార్చి 15: గతంలో మాదిరిగా కాల్వలో నీళ్లు వస్తాయనుకొని రెండున్నర ఎకరాల్లో మక్కజొన్న పంట వేసిన. మా భూమి 5 ఎల్‌డీ-9 సౌత్ మెయిన్ కెనాల్, డీ-4 కాల్వ ఒడ్డుకు ఉంది. గతంలో జనవరి నుంచి మార్చి వరకు కాల్వలో నీళ్లు మూడు నుంచి నాలుగు సార్లు వదిలేవాళ్లు. దీంతో బావులు, బోర్లలో నీళ్లు ఉబికేవి. అదే ధైర్యంలో రెండున్నర ఎకరాల్లో మక్క జొన్న పంట వేసి, కంకి పీసు తోడే టైంకు బోరు ఎండిపోయింది. కాల్వ ఒడ్డుకే ఉన్నది. నీళ్లు వస్తే పంట పండుతుంది అనుకున్న, కానీ నీళ్లు రాకపోవడంతో చేతికొచ్చిన పంట ఎండిపోయింది. రూ.50 వేల నష్టం జరిగింది. పంట ఎండిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- పెండ్లి కుమారస్వామి, రైతు, ఒంటిమాడిపల్లి (నాగపురం)

ఎండిన మక్కజొన్న పంటను చూపుతున్న రైతు కుమారస్వామి

ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీంలో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఖజానా నింపుకోవడంపైనే సర్కారు దృష్టి పెట్టడంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ గందరగోళంగా మారింది. ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో 2020 ఆగస్టు నాటికి ఉన్న భూమి విలువపై ఫీజులు వేయాలని, ఆ తర్వాత వాటికి రిజిస్ట్రేషన్ తేదీ నాటి మార్కెట్ విలువపై రుసుము వసూలు చేయాలని ఉంది. అయితే దానిని తుంగలో తొక్కి ప్రస్తుతం ఇప్పటి మార్కెట్ విలువపై 14 శాతం ఫీజులు వసూలు చేస్తుండడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. అధికారులు ఫీల్డ్ వెరిఫికేషన్‌కు వెళ్లి ఎల్ఆర్ఎస్‌కు అర్హత ఉందా? లేదా? అనేది తేల్చి, ఉన్న వాటికే రుసుం వసూలు చేయాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా క్షేత్రస్థాయిలో భూమిని, డాక్యుమెంట్లను పరిశీలించకుండానే వచ్చిన ప్రతి దరఖాస్తుకు ఫీజు ఫిక్స్ చేసి వసూలు చేయడం ఏంటని అర్జీదారులు ప్రశ్నిస్తున్నారు. తిరస్కరిస్తే 10 శాతం కట్ చేసి మిగతా 90 శాతం అకౌంట్‌లో జమచేస్తామంటున్నారని వాపోతున్నారు. - వరంగల్, మార్చి 15

అడ్డగోలు ఫీజులు!

గందరగోళంగా ఎల్ఆర్ఎస్ ప్రక్రియ

- ఖజానా నింపుకోవడంపైనే సర్కారు దృష్టి
- ఫీల్డ్ వెరిఫికేషన్ చేయకుండానే రుసుము
- తిరస్కరిస్తే 10 శాతం కట్
- నిబంధనలకు విరుద్ధంగా వసూలు
- లబోదిబోమంటున్న దరఖాస్తుదారులు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ చేయకుండానే ఫీజులను ఫిక్స్ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం స్థలం వద్దకు వెళ్లి డాక్యుమెంట్లను పరిశీలించిన తర్వాత అర్హత ఉంటే ల్యాండ్, దరఖాస్తుదారుడి ఫొటోలు తీసుకుని పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. తర్వాత డాక్యుమెంట్ ప్రకారం ఫీజులను ఫిక్స్ చేయాలి. బల్దియా ఖజనా నింపుకోవాలన్న ఆలోచనతో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, ప్రభుత్వ భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న భూములకు సైతం అధికారులు చార్జీలు ఫిక్స్ చేసి మెసేజ్‌లు పంపిస్తున్నారు. దీంతో చాలా మంది దరఖాస్తుదారులు అధికారులు వేస్తున్న రుసుము చెల్లించేందుకు జంకుతున్నారు. అడ్డగోలు ఫీజులపై ప్రశ్నిస్తే తప్పులను సరిచేసుకునేందుకు ఎడిట్ ఆప్షన్ లేదంటున్నారని బాధితులు పేర్కొంటున్నారు.

తిరస్కరణ అయితే 10 శాతం కట్

మార్చి 31వ తేదీలోపు ప్రభుత్వం 25 శాతం రాయితీ ప్రకటించిన నేపథ్యంలో ముందస్తుగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు, ఆ తర్వాత ఫీల్డ్ వెరిఫికేషన్ చేస్తామని అధికారులు చెబుతున్నారు. అప్పుడు నిబంధనల ప్రకారం లేకుంటే దరఖాస్తును తిరస్కరిస్తామని, వారికి చెల్లించిన ఫీజులో 10 శాతం కట్ చేసి మిగతా 90 శాతం ఫీజు అకౌంట్‌లో జమ చేస్తామంటున్నారు. ముందస్తుగా భూమిని పరిశీలించి ఎల్ఆర్ఎస్‌కు అర్హత ఉందా? లేదా? అనేది తేల్చాలి, అర్హత ఉన్న వాటికే ఫీజులు వసూలు చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు. సిబ్బంది కొరత ఉంటే ఔట్‌సోర్సింగ్‌లో నియమించుకొని మార్చి 31 లోపు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని పేర్కొంటున్నారు.

చార్జీల మోత

నిబంధనల ప్రకారం పాత డాక్యుమెంట్లకు 2020 ఆగస్టు మార్కెట్ విలువ, 2020 తర్వాత డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్ నాటి మార్కెట్ విలువతో ఫీజులు వేయాల్సి ఉంది. అయితే బల్దియా సిబ్బంది మాత్రం ఇప్పటి మార్కెట్ విలువ ప్రకారం ఫీజులు వేస్తున్నట్లు దరఖాస్తుదారులు వాపోతున్నారు. దీంతో వేలలో రావాల్సిన ఫీజులు లక్షల్లో వస్తున్నాయని లబోదిబోమంటున్నారు. రూ.3 వేల లోపు మార్కెట్ విలువ ఉన్న ప్రాంతంలో 20 శాతం, రూ. 5 వేల లోపు విలువున్న ప్రాంతంలో 30 శాతం, రూ. 10వేల లోపున్న ప్రాంతంలో 40శాతం, రూ. 20వేల లోపు 50 శాతం, రూ. 30 వేల లోపు 60 శాతం, రూ. 50 వేల లోపు 80 శాతం, రూ.50 వేల పైన మార్కెట్ విలువున్న ప్రాంతాల్లో 100 శాతం క్రమబద్ధీకరణ చార్జీలు వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. 2020 నుంచి ఇప్పటి వరకు సుమారు 5 సార్లు ప్రభుత్వం మార్కెట్ విలువను పెంచిందని టెక్నికల్ పర్సన్స్ అంటున్నారు. అయితే పాత డాక్యుమెంట్లకు సైతం ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఫీజులు వేస్తుండడంతో దరఖాస్తుదారులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

హెల్ప్‌డెస్క్ వద్ద బారులుతీరిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు

బీఆర్ఎస్ శ్రేణులపై జులుం

- గిర్నిబావి వద్ద పోలీసుల ఓవరాక్షన్
- కార్యకర్తలపై ఇష్టారాజ్యంగా లాఠీచార్జి
- కొమ్మాల జాతరలో తీవ్ర ఉద్రిక్తత
- ఖాకీల తీరుపై మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆగ్రహం

బీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జ్ చేస్తున్న పోలీసులు

పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

దుగ్గొండి, మార్చి,15 : కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి జాతరకు వివిధ పార్టీల ప్రభ బండ్ల తరలింపు సందర్భంగా శనివారం వరంగల్-నర్సంపేట రహదారి గిర్నిబావి సెంటర్‌లో బీఆర్ఎస్ శ్రేణులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. జాతరకు యేటా బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం, బీజేపీ ఆధ్వర్యంలో ప్రభ బండ్లతో తరలి వెళ్లడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ క్రమంలో గత వారం రోజులుగా నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో భారీగా పోలీసులు మోహరించి చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు అధికార పార్టీకి చెందిన ప్రభలనే ముందుగా తరలిస్తూ బీఆర్ఎస్ పార్టీ ప్రభలను నిలిపివేశారు. తొగర్రాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ ప్రభ బండి ముందుకు రాగా బీఆర్ఎస్ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న సమ యంలో ఇరు పార్టీల కార్యకర్తలు నినాదాలు చేస్తూ వాగ్వాదానికి దిగారు. దీంతో తోపులాట జరిగింది. ఈ క్రమంలో ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తలపై విచక్షణారహితంగా లాఠీచార్జి చేశారు. ఈ ఘటనలో గిర్నిబావికి చెందిన కంచరకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, యార శ్రీనివాస్, సద్ది నరసింహారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం ఇరు పార్టీల కార్యకర్తలను పోలీసులు చెదరగొట్టారు.

కావాలనే మా కార్యకర్తలపై దాడి

-మాజీ ఎమ్మెల్యే పెద్ది

బీఆర్ఎస్ నాయకులపై పోలీసుల లాఠీచార్జి విషయం తెలుసుకున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఘటనా స్థలానికి వచ్చారు. పోలీసుల ఓవరాక్షన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసి పార్టీ కార్యకర్తలతో ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అకారణంగా ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వందల సంఖ్యలో పోలీసులు లాఠీచార్జి చేశారని, కావాలనే తమ కార్యకర్తలపై దాడి చేశారని మండిపడ్డారు. అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై వాటాలు పంచుకొని నర్సంపేటలో ప్రతిపక్ష కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇతర పార్టీల కార్యకర్తలపై దాడుల సంస్కృతిని కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహిస్తున్నదని, రాబోయే రోజుల్లో దాడులకు ప్రతి దాడులు తప్పవని ఆయన హెచ్చరించారు.

నేడు జనగామ జిల్లాకు సీఎం రేవంత్

స్టేషన్‌ఘన్‌పూర్‌లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

జనగామ, మార్చి 15 (నమస్తే తెలంగాణ)/స్టేషన్‌ఘన్‌పూర్ : సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం జనగామ జిల్లాలో పర్యటించనున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజవకర్గ పరిధిలో రూ. 800 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం స్టేషన్‌ఘన్‌పూర్ కేంద్రంలోని పాలకుర్తి రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సభలో పాల్గొంటారు. ఇందుకోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా, మునుపెన్నడూ లేనివిధంగా 850 మంది పోలీసు బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో రానున్న సీఎం నేరుగా శివునిపల్లిలోని సభాస్థలి వద్దకు చేరుకొని ఇందిరా మహిళా శక్తి స్టాల్స్‌ను సందర్శిస్తారు. అక్కడ వివిధ ఎస్‌హెచ్‌జీలకు సంబంధించిన ఇందిరా మహిళా శక్తి బస్సులు ప్రారంభించి అక్కడే వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిన అనంతరం సభలో మాట్లాడతారు.

రేవంత్‌రెడ్డి సభను అడ్డుకుంటాం

- ప్రజలను మోసం చేయడానికే తూతూమంత్రంగా శంకుస్థాపనలు
- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 15 : ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయని సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్ పర్యటనకు వస్తున్నారని, ఆయన పాల్గొనే సభను అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య హెచ్చరించారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆయన శనివారం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగంపై జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ అమలు చేయని హామీలపై ప్రశ్నిస్తే సస్పెండ్ చేశారన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కేయాలనే ఉద్దేశంతోనే ఇలాంటి దుశ్చర్యలకు కాంగ్రెస్ సర్కారు పాల్పడుతున్నదన్నారు. భారతదేశంలో అట్టర్ ఫ్లాప్ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎవరైతే రాజీనామా చేయకుండా పార్టీ ఫిరాయిస్తారో వాళ్లను రాళ్లతో కొట్టి చంపండి అని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరితో ఏర్పాటు చేసిన సభకు రావడం సిగ్గు చేటన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలను మోసం చేయడానికి తూతూమంత్రంగా శంకుస్థాపనలు చేసి పోదామని అనుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. చేతిలో చిల్లి గవ్వలేదని, కనీసం రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై ఏడాది గడిచినా స్పీకర్ నిర్ణయం తీసుకోకపోవడం దారుణమని రాజయ్య అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్, మాజీ జడ్పీటీసీ మారపాక రవి, మాజీ సర్పంచ్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.